సాక్షి
జనగామ
శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు
టీజీ ఎన్పీడీసీఎల్‌లో అధికారులు, ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు సీఎండీ వరుణ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. - 10లో



కక్కుర్తి పడ్డారు.. అడ్డంగా దొరికారు
జిల్లా ఆర్‌అండ్‌ బీ ఈఈ హుస్సేన్‌, ఏటీఓ రవీందర్‌ లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. - 10లో

గరిష్టం/కనిష్టం
34^0 /23^0
వాతావరణం
ఉదయం నుంచి పొడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం అక్కడక్కడా మేఘావృతం అవుతుంది.

న్యూస్‌రీల్‌

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

● జిల్లా విద్యాధికారి రాము



దేవరుప్పుల : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని డీఈఓ కె.రాము అన్నారు. శుక్రవారం చిన్నమడూరు హైస్కూల్‌లో స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యాన నిర్వహించిన అండర్‌–14, 17 విభాగం క్రీడోత్సవాల్లో ఆయన మాట్లాడారు. ప్రస్తుత విషతుల్యమైన ఆహారం వల్ల అనేక అనర్థాలు చవిచూడాల్సి వస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరికీ వ్యాయామం తప్పనిసరిగా మారిందన్నారు. సంపూర్ణ ఆరోగ్యం పొందడానికి విద్యార్థులు శారీరక, మానసిక ఉల్లాసం లభించే క్రీడారంగంపై దృష్టి సారించాలని చెప్పారు. ఈ మండల స్థాయి పోటీల్లో శ్రీసాయి ప్రశాంతి విద్యార్థులు 17 మంది జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ఎంఈఓ జి.కళావతి, ఎస్‌ఓ రమేష్‌, ఏఏపీసీ చైర్మన్‌ శోభ, ఫిజికల్‌ డైరెక్టర్లు ఎ.ప్రవీణ్‌కుమార్‌, బి.కిరణ్‌, ఎం.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పనుల పురోగతికి పాటుపడాలి



కొడకండ్ల : ప్రభుత్వ పాఠశాలలోల పనుల పురోగతికి పాటుపడాలని అదనపు కలెక్టర్‌ పింకేష్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం మండలంలోని చెరువుముందు, కడగుట్టతండా ప్రాథమిక పాఠశాలల ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. అమ్మ ఆదర్శ, మనఊరు–మనబడి కార్యక్రమాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. తాగునీరు, విద్యుత్‌, టాయిలెట్లు తదితర మౌలిక వసతుల కల్పనలో తేడారావొద్దని సూచించారు. డీఈఓ రాము, ఎంపీడీఓ శేషాద్రికుమార్‌, ఎంఈఓ గ్రేస్‌కేజియారాణి తదితరులు పాల్గొన్నారు.

రేబిస్‌ వ్యాధిపై అవగాహన కల్పించాలి

జనగామ: రేబిస్‌ వ్యాధి నివారణపై స్కూళ్లు, కళాశాలలు, ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్‌ రిజ్వాన్‌ బాషా అన్నారు. ప్రపంచ రేబిస్‌ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పశువైద్య, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మండలాల్లో శనివారం రేబిస్‌ నివారణ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వాల్‌ పోస్టర్లను కలెక్టర్‌ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్‌ రాధాకిషన్‌, డాక్టర్‌ నర్సయ్య, ఏడీ దేవేందర్‌, హఫీజ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ కోర్సులతో ఉపాధి అవకాశాలు



జనగామ రూరల్‌: ఐటీఐ కోర్సులతో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని రీజినల్‌ డిప్యూటీ డైరెక్టర్‌ ఎస్‌.రాజా అన్నారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ సాయితేజ ఐటీఐలో జరిగిన స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఐటీఐకి డిమాండ్‌ ఉందని, నైపుణ్యాన్ని బట్టి వేతనాలు ఉంటాయని చెప్పారు. ఐటీఐ పూర్తి చేసిన వారికి త్వరలో జాబ్‌ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్‌ ఆలేరు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ హరికృష్ణ, కాజీపేట కళాశాల ప్రిన్సిపాల్‌ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ నుంచి ‘వేముల’ సస్పెన్షన్‌

జనగామ: పార్టీ నిర్ణయాలు, నిబంధనలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న 14వ వార్డుకు చెందిన వేముల మల్లేష్‌ను సస్పెండ్‌ చేస్తున్నట్లు కాంగ్రెస్‌ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక నుంచి అతడితో పార్టీకి ఎలాంటి సంబంధం ఉండబోదని స్పష్టం చేశారు.

నేడు లోక్‌ అదాలత్‌

జనగామ రూరల్‌: జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్‌ అదాలత్‌ నిర్వహిస్తున్నామని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి డి.రవీంద్ర శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. రాజీపడదగిన కేసులను ఈ వేదిక ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటలకు నాలుగు బెంచ్‌ల ద్వారా లోక్‌ అదాలత్‌ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఆయిల్‌పాం @ ఐదోస్థానం

● జిల్లాలో 6,655 ఎకరాల్లో సాగు
● పంట సాగుతో అధిక లాభాలు
● ప్రభుత్వ ప్రోత్సాహంతో రైతుల్లో పెరుగుతున్న ఆసక్తి
● దిగుమతి సుంకం పెంపుతో ధర మరింత పెరిగే అవకాశం



ఎల్లంలలో సాగు చేసిన ఆయిల్‌పాం తోట

‘పాలకుర్తి మండలం ముత్తారం గ్రామానికి చెందిన అనంతరావు, రామారావు, సుజాత 2021–22 సంవత్సరంలో 36 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటారు. ప్రస్తుతం తోట వయసు 38 నెలలు. ఈ ఏడాది ఏప్రిల్‌లో గెలలు కోయడం మొదలు పెట్టారు. ఇప్పటి వరకు 10 దఫాల్లో 70 టన్నుల దిగుబడి రాగా రైతులు రూ.9,83,210 ఆదాయం పొందారు. ఆయిల్‌పాం సాగు లాభసాటిగా ఉందని, చీడపీడల బెడద లేదని సదరు రైతులు చెప్పారు’.

జనగామ రూరల్‌: వంట నూనెల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పాం సాగుపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. రైతులను ప్రోత్సహించేందుకు వివిధ రకాల సబ్సిడీలు ఇస్తున్నాయి. మొక్కల పంపిణీ నుంచి డ్రిప్‌ పరికరాలు, అంతర పంటల సాగు తదితరాలకు అవసరమైన పెట్టుబడి, రాయితీలు ఇస్తున్నాయి. దీంతో అన్నదాతలు ఆయిల్‌పాం సాగుపై ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో 2021 నుంచి ఇప్పటివరకు 6,655 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయడంతో రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచింది. దేశీయ పామాయిల్‌ రైతులను ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ముడిపామాయిల్‌ దిగుమతిపై సుంకాన్ని 5.5 శాతం నుంచి 27.5 శాతానికి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రస్తుతం టన్ను ఆయిల్‌పాం ధర రూ.14,392 ఉండగా.. అదనంగా రూ.1,500 నుంచి రూ.1,700 వరకు పెరిగే అవకాశం ఉంది. జిల్లాలో ఆయిల్‌పాం సాగు పెంచడానికి జిల్లా అధికార యంత్రాంగం కలెక్టర్‌ రిజ్వాన్‌ బాషా నేతృత్వంలో రైతులకు అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నికర ఆదాయానికి అవకాశం

ఆయిల్‌పాం సాగుతో 4 నుంచి 30 ఏళ్ల వరకు నిరంతర నికర ఆదాయం పొందవచ్చు. పంటకు చీడపీడల బెడద ఉండదు. అంతర పంటలుగా వేరుశనగ, పెసర, మినుము, నువ్వులు, పొద్దుతిరుగుడు సాగుచేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చు. బ్యాంకుల నుంచి రుణ సాయం అందుతుంది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలో 792 ఎకరాల్లో డ్రిప్‌ పరికరాలకు పరిపాలనా అనుమతులు వచ్చాయి. 1,225 ఎకరాల్లో మొక్కల పంపిణీకి పరిపాలన మంజూరు లభించగా. ఈ వార్షిక ప్రణాళికలో 875 ఎకరాల్లో రైతులు నాటారు.

2021 నుంచి 2024(ప్రస్తుతం) వరకు మండలాల వారీగా రైతులు ఆయిల్‌పాం సాగు చేసిన వివరాలు ఇలా..

మండలం	రైతులు	ఎకరాలు
బచ్చన్నపేట	250	816.74
జనగామ	203	657.82
నర్మెట	99	307.04
తరిగొప్పుల	96	326.12
దేవరుప్పుల	175	601.16
కొడకండ్ల	82	345.16
పాలకుర్తి	215	715.86
లింగాలఘణపురం	202	694.95
చిల్పూర్‌	76	333.05
రఘునాథపల్లి	237	852.36
స్టేషన్‌ఘన్‌పూర్‌	160	525.97
జఫర్‌గఢ్‌	159	479.49
మొత్తం	1954	6655.72



గెలలు కోతకు సిద్ధంగా ఉన్నాయి..
నేను 2021–22 సంవత్సరంలో పది ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటాను. ప్రస్తుతం తోట వయసు 34 నెలలు. గెలలు కోతకు సిద్ధంగా ఉన్నాయి.
– ఆల నారాయణ, హన్మంతాపూర్‌(నర్మెట)

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్రంలో ఆయిల్‌పాం సాగులో జిల్లా 5వ స్థానంలో ఉంది. రైతులకు లాభసాటిగా.. ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలంగా ఉండడంతో ఆసక్తి చూపుతున్నారు. ఆయిల్‌పాం సాగు పెంచడమే లక్ష్యంగా అధికారులు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. ప్రతీ నెల సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అందరూ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలి.
– షేక్‌ రిజ్వాన్‌ బాషా, కలెక్టర్‌

ఎన్‌హెచ్‌ఎం పోస్టుల భర్తీపై విస్మయం

● అర్హత ఉన్నా తిరస్కరించారంటూ కలెక్టర్‌కు బాధితుల ఫిర్యాదు
● అభ్యంతరాలపై 28 వరకు గడువు

జనగామ: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వివిధ కేటగిరీల్లో ఖాళీగా ఉన్న 32 పోస్టులను ఎన్‌హెచ్‌ఎం స్కీంలో కాంట్రాక్టు, ఔట్‌ సోర్సింగ్‌ పద్ధతిన భర్తీ చేయడానికి నోటిఫికేషన్‌ వేశారు. అర్హులైన నిరుద్యోగులకు అన్యాయం చేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఏడాది మార్చి 3న దరఖాస్తులు స్వీకరించి 11న పరిశీలన పూర్తి చేసి, 12న ప్రావిజనల్‌ జాబితా ప్రచురించారు. అయితే జాబితా తప్పుల తడకగా ఉందని కమిటీ ఏర్పాటు చేసి రీ స్క్రూటినీ నిర్వహించి రివైజ్డ్‌ ప్రావిజనల్‌ జాబితా విడుదల చేశారు. తాజాగా రెండు రోజుల క్రితం మెరిట్‌, అర్హుల జాబితాను డీఎంహెచ్‌ఓ కార్యాలయం నోటీసు బోర్డుతో పాటు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దీనిపై పలువురు నిరుద్యోగులు అభ్యంతరం తెలిపారు. మెరిట్‌ ఉన్నా.. జాబితాలో జీరో శాతం పర్సంటేజీ వేసి అన్యాయం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని కొడకండ్ల మండలం రామన్నగూడెం బోడోనికుంటతండాకు చెందిన ధరావత్‌ అశోక్‌ కలెక్టరేట్‌ ఆవరణలో విలేకరులతో వాపోయారు. అనంతరం కలెక్టర్‌ రిజ్వాన్‌ బాషా బయటకు వెళ్లే క్రమంలో కలిసి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. డిగ్రీలో 68.45శాతం పర్సంటేజీ ఉంటే.. రెండో జాబితాలో 58.90 శాతం వేసి.. రివైజ్డ్‌లో జీరో అని రాశారని, ఇదేమిటని అడిగితే మెమో క్లారిటీగా లేదనే సాకుతో ఉద్యోగం రాకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్‌ ‘ఇబ్బంది కలిగితే మరోసారి దరఖాస్తు ఇవ్వండి.. పరిశీలిస్తామని’ కలెక్టర్‌ భరోసా ఇచ్చారు.

అంతా అయోమయం..



తనకు జరిగిన అన్యాయం గురించి వివరిస్తున్న అశోక్‌

మొత్తం 32 పోస్టుల భర్తీ కోసం మొదట జాబితా విడుదల చేయగా.. తప్పుల తడకగా ఉందని రివైజ్డ్‌ వేశారు. రెండో జాబితా నోటీసులో నలుగురిని అర్హులుగా చూపించి.. మిగతా వారికి సంబంధించి సర్టిఫికెట్లు తదితర టెక్నికల్‌ సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. చివరగా నోటీసు బోర్డుపై వేసిన జాబితాలో అత్యధికంగా పర్సంటేజీ ఉన్నప్పటికీ.. అనుభవ సర్టిఫికెట్లు లేవని చూపించిన అధికారులు చివరి కాలంలో ఎందుకు ఆప్షన్‌గా ఇచ్చారనే ప్రశ్న తలెత్తుతున్నది.

28 వరకు అభ్యంతరాల స్వీకరణ : డీఎంహెచ్‌ఓ

ఎన్‌హెచ్‌ఎం స్కీంలో ఔట్‌ సోర్సింగ్‌, కాంట్రాక్టు పద్ధతి పోస్టుల భర్తీకి సంబంధించి మెరిట్‌ జాబితాపై అభ్యంతరాలను ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో స్వీకరిస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవీందర్‌ గౌడ్‌ ఒక ప్రకటనలో తెలిపారు. సరైన పత్రాలతో సమర్పించిన అభ్యంతరాలను మాత్రమే పరిగణించి మార్పులు చేర్పులు చేస్తామన్నారు. కాగా మెరిట్‌ విషయంలో వచ్చే ఆరోపణల్లో వాస్తవ లేదన్నారు.

వయోవృద్ధులను ఆదరించాలి

జనగామ రూరల్‌: ప్రతి ఒక్కరూ వృద్ధులను తమ తల్లిదండ్రులుగా భావించి ఆదరించాలని ఆర్డీఓ కొమురయ్య, ఏసీపీ పార్థసారధి అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన పట్టణంలో నెహ్రూపార్క్‌ నుంచి చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అందరూ ప్రతిజ్ఞ చేశారు. జిల్లా సంక్షేమాధికారి జయంతి, ఎస్‌.చెన్నకేశవులు, డీఎంహెచ్‌ఓ రవీందర్‌, జెడ్పీ సీఈఓ సరిత, సీడీపీఓ రమాదేవి పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీఓ, తదితరులు

‘ఏబీవీ’ హాస్టల్‌ విద్యార్థులకు జ్వరాలు



వంటశాలలో పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ, ఎస్సై



జ్వరంతో బాధపడుతున్న హాస్టల్‌ విద్యార్థులు

● తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ, పోలీసులు

జనగామ: పట్టణంలోని ఏబీవీ జూనియర్‌ కళాశాల హాస్టల్‌ విద్యార్థులు సీజనల్‌ జ్వరాలతో ఇబ్బంది పడుతుండగా ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ రవీందర్‌గౌడ్‌, డాక్టర్‌ ప్రవీణ్‌, ఎస్సై రాజేశ్‌ తదితరులు హాస్టల్‌ను పరిశీలించారు. వంటశాలతోపాటు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థుల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవీందర్‌గౌడ్‌ మాట్లాడుతూ వంటశాలతో పాటు శానిటేషన్‌ నిర్వహణను మరింత మెరుగు పర్చుకోవాల్సి ఉందన్నారు. విద్యార్థులకు ఆర్‌ఎంపీతో ట్రీట్‌మెంట్‌ చేయించడం ఏమిటని ప్రశ్నించారు. అనుభవజ్ఞులైన ఎంబీబీఎస్‌ డాక్టర్‌తో రోజూ రెండుసార్లు వైద్య పరీక్షలు చేయించాలని చెప్పారు. ఆస్పత్రిలో అడ్మిట్‌ చేసిన సాయికుమార్‌, షానవాజ్‌, సందీప్‌, రాజేశ్‌ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని, హాస్టల్‌లోని విద్యార్థులకు సైతం వైద్య పరీక్షలు చేయిస్తామన్నారు.

స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్‌బాపూజీ

● కలెక్టర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా

జనగామ/జనగామ రూరల్‌: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ భావితరాలకు స్ఫూర్తి ప్రదాత అని కలెక్టర్‌ రిజ్వాన్‌ బాషా అన్నారు. కొండా లక్ష్మణ్‌ బాపూజీ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్‌ రోహిత్‌సింగ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడుతూ.. స్వాతంత్య్ర, నిజాం వ్యతిరేఖ పోరాటాలు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాల్లో ప్రముఖ పాత్ర వహించిన గొప్ప వ్యక్తి లక్ష్మణ్‌ బాపూజీ అని అన్నారు. స్వదేశీ వస్త్రాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ చేనేత సంఘాల బలోపేతానికి కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్రను భావితరాలకు అందుబాటులో ఉండేలా సంబంధిత పుస్తకాలు జిల్లా గ్రంథాలయాల్లో ఉండేలా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి రవీందర్‌, వివిధ శాఖల అధికారులు, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్‌బాపూజీకి నివాళులర్పిస్తున్న కలెక్టర్‌, అదనపు కలెక్టర్‌ తదితరులు

డీసీసీ కార్యాలయంలో..

ఆచార్య కొండా లక్ష్మణ్‌ బాపూజీ జయంతిని డీసీసీ కార్యాలయంలో నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెంచారపు బుచ్చిరెడ్డి, లింగాల నర్సిరెడ్డి, బనుక శివరాజ్‌ యాదవ్‌, నూకల బాల్‌రెడ్డి, మెరుగు బాల్‌రాజ్‌, మిద్దెపాక సిద్ధులు, బ్యాంగి భాస్కర్‌, గొలుసుల దుర్గేష్‌, మురహరి, వంగాల మల్లారెడ్డి, వంగాల కల్యాణి, మహ్మద్‌ జాఫర్‌షరీఫ్‌, ఆరుట్ల లోకేమంత్‌ రెడ్డి, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

తరిగొప్పుల: ఓటు హక్కుపై అవగాహన కల్పించాలని ఆర్డీఓ డి.కొమురయ్య అన్నారు. మండలకేంద్రంలోని పోలింగ్‌ కేంద్రాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఓటర్ల పరిశీలనలో భాగంగా చేపట్టిన ఇంటింటా సర్వే రికార్డులను పరిశీలించారు. వయసు 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్‌ కార్యాలయ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఇంట్లో నివసిస్తున్న అర్హులందరికీ ఓటు హక్కు ఉందా లేదా.. ఎవరైనా వలస వెళ్లారా అని విచారణ చేపట్టాలని చెప్పారు. ఓటు హక్కు లేనివారు ఉంటే నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. తహసీల్దార్‌ నాగేశ్వరచారి, ఆర్‌ఐ రవీందర్‌, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ కొమురయ్య

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

● నేషనల్‌ హైవే పై ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి
● కలెక్టర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా

జనగామ రూరల్‌: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడపాలని కలెక్టర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఆరంభం నుంచి ముగింపు ప్రాంతం వరకు పోలీస్‌, నేషనల్‌ హైవే, మున్సిపల్‌ శాఖలకు చెందిన అధికారులు జాయింట్‌ ఇన్‌స్పెక్షన్‌ నిర్వహించి తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి నివేదిక పది రోజుల్లో ఇవ్వాలన్నారు. ప్రమాద సూచికలు, మలుపుల వద్ద స్పీడ్‌ లిమిట్‌ సూచికలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లా మీదుగా వెళ్తున్న నేషనల్‌ హైవేపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని.. దీనిపై ఎన్‌హెచ్‌ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై కళాశాలల యాజమాన్యాలు యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో డీసీపీ రాజమహేంద్రనాయక్‌, రవాణా శాఖ జిల్లా అధికారి, జనగామ, వర్ధన్నపేట ఏసీపీలు, మున్సిపల్‌ కమిషనర్‌, నేషనల్‌ హైవే, పీఆర్‌, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలి

ఖరీఫ్‌ ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా అన్నారు. శుక్రవారం వ్యవసాయ, మార్కెటింగ్‌ అధికారులు, మిల్లర్లతో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్‌ రోహిత్‌సింగ్‌తో కలిసి మాట్లాడారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 65,989 ఎకరాల్లో సన్న రకం, 1,37,406 ఎకరాల్లో దొడ్డు రకం వరి సాగైందని, మొత్తం 2,05,109 మెట్రిక్‌ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఇందుకు తగినట్టుగా అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు ఐకేపీ 94, పీఏసీఎస్‌ 84, ఇతర 2 కలిపి 180 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అన్ని సెంటర్లలో టార్పాలిన్లు, గన్నీబ్యాగులు, తేమ కొలిచే యంత్రాలు సరిపడా ఉండేలా చూడాలన్నారు. కేంద్రాల వారీగా ధాన్యం తీసుకురావాల్సిన తేదీలు, సమయాలు రైతులకు స్పష్టంగా తెలిసేలా వ్యవసాయ అధికారులు టోకెన్‌ జారీ చేయాలని చెప్పారు. మార్కెట్‌ యార్డ్‌లోనూ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఓ వసంత, సివిల్‌ సప్లయ్‌, వ్యవసాయ, మార్కెటింగ్‌ అధికారులు సరస్వతి, రామారావు నాయక్‌, నరేందర్‌, మిల్లర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ రిజ్వాన్‌ బాషా

విద్యార్థులు కళల్లో రాణించాలి

● యువజనోత్సవాల్లో కలెక్టర్‌ రిజ్వాన్‌ బాషా

జనగామ రూరల్‌: విద్యార్థులు చదువుతో పాటు కళల్లోనూ రాణించాలని కలెక్టర్‌ షేక్‌ రిజ్వాన్‌ బాషా అన్నారు. యువజనోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా యువజన, క్రీడలశాఖ ఆధ్వర్యాన స్థానిక జూబ్లీహిల్స్‌ ఫంక్షన్‌ హాల్‌లో నిర్వహించిన వేడుకలను కలెక్టర్‌తోపాటు జిల్లా యువజన, క్రీడల అధికారి, స్థానిక కార్పొరేటర్‌ అనిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడుతూ.. విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మానసిక, శారీరక ఉల్లాసం కలిగి వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందన్నారు. వివిధ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి.. రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులను జనవరి 12 నుంచి జరిగే జాతీయ స్థాయి యువజనోత్సవాలకు పంపిస్తారని పేర్కొన్నారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించిన కలెక్టర్‌ రిజ్వాన్‌ బాషా విద్యార్థులను అభినందించారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సేఫ్టీ మోకులపై శిక్షణ



శిక్షణలో భాగంగా సేఫ్టీ మోకులతో తాటి చెట్లు ఎక్కుతున్న గీత కార్మికులు

లింగాలఘణపురం: మండల పరిధి వడిచర్ల, నేలపోగుల గ్రామాల్లో శుక్రవారం సేఫ్టీ మోకులపై గీత కార్మికులకు జిల్లా కోఆర్డినేటర్‌ వెంకటమల్లయ్య, బీసీ వెల్ఫేర్‌ ఆఫీసర్‌ రవీందర్‌ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. వారం రోజులుగా జిల్లాలోని ఐదు మండలాల్లో 265 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు వెంకటమల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆకుల కృష్ణ, గైని కృష్ణమూర్తి, వీరస్వామి, యాదగిరి, రాములు, చందు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ‘వేస్ట్‌ టు వెల్త్‌’ ఎగ్జిబిషన్‌



సర్టిఫికెట్లతో విజేతలుగా నిలిచిన పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు

జనగామ రూరల్‌: విద్యార్థులు వ్యర్థాల నుంచి ఆకర్షణీయమైన కళాకృతులు తయారు చేసి ఆకట్టుకున్నారు. శుక్రవారం పట్టణంలోని ధర్మకంచ పాఠశాలలో జిల్లా స్థాయి ‘వేస్ట్‌ టు వెల్త్‌’ పోటీలు నిర్వహించారు. ఎన్‌జీసీ ఎకో క్లబ్‌లోని 60 పాఠశాలల నుంచి ఇద్దరు విద్యార్థులు, ఒక టీచర్‌ చొప్పున ఎగ్జిబిట్లతో పాల్గొన్నారు. నర్మెట కేజీబీవీ మొదటి స్థానం (రూ.3,000 నగదు బహుమతి), దేవరుప్పుల జెడ్పీఎస్‌ఎస్‌ రెండో స్థానం(రూ.2,000), బచ్చన్నపేట కేజీబీవీ మూడో స్థానం(రూ.1,000), తరిగొప్పుల జెడ్పీఎస్‌ఎస్‌ నాలుగో స్థానం(రూ.500), చీటూరు కన్సోలేషన్‌ బహుమతి(రూ.500)కి ఎంపికయ్యాయి. అలాగే పాల్గొన్న వారందరికీ ప్రశంసపత్రాలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌, జిల్లా సహాయ సమన్వయకర్తలు అనిల్‌, నవీన్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

హన్మకొండ అర్బన్ : జిల్లాలో 2023–2024 విద్యాసంవత్సరానికి ప్రతిభావంతులైన ఆర్య వైశ్య విద్యార్థులకు పురస్కారాలు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అవోపా అధ్యక్షుడు వల్లాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఇమ్మడి పుల్లయ్య, విద్యా కమిటీ చైర్మన్ దేసు సదానందం శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పదో తరగతి నుంచి పీజీ వరకు 61 కోర్సులకు చెందిన ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆర్య వైశ్య విద్యార్థులు ఈనెల 30 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు హనుమకొండ సుబేదారిలోని అవోపా కార్యాలయంలో దరఖాస్తు పత్రాలు తీసుకొని పూర్తి చేసి సమర్పించాలని కోరారు. 61 కోర్సుల్లో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు బంగారు పతకాలు అందజేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుతోపాటు విద్యార్థి ఫొటో, ఆధార్ కార్డు, మార్కుల మెమో జిరాక్స్ కాపీలు జత చేయాలని, సందేహాల నివృత్తికి 94406 36447, 99498 75510 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పేకాట శిబిరంపై దాడులు

హసన్‌పర్తి: 65వ డివిజన్ ఎల్లాపురంలోని ఓ పేకాట శిబిరంపై శుక్రవారం రాత్రి దాడులు నిర్వహించి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు. ఎల్లాపురంలోని ఓ రహస్యప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈసందర్భంగా పేకాట ఆడుతున్న వెలిశోజు శ్రీరాం, బాషబోయిన రాజన్‌బాబు, కుసుమ సురేశ్, వెల్లపు నాగరాజు, రాపోలు శ్రీనివాస్, కుమారస్వామి, ఎర్ర రాజులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.5,510 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.





సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్&డిస్టెన్స్ అడ్మిషన్స్:డిగ్రీ,PG, B.Tech., Diploma, D&B- ఫార్మసీ, B.Ed, B.P.Ed, MBA, MCA, B.Sc (Agri), B.Sc (నర్సింగ్), GNM. 4 నెలల్లో పరీక్షలు. ఫోన్ : 8866977112, 339 [HA-16400]

REAL ESTATE

COMMERCIAL RENT

■ Commercial space for Rent Ground & 1st Floor, with Parking 6128 x 2 Floors=12,256 sft. Hyder Manikanta Complex, Old Bus Depot Main Road, Near Thirumala Bar, Hanamkonda, Cont: 9542981472, 9440015246. [W-1239914]

TO-LET

■ WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్ రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. గోశాల ప్రక్కన. సంప్ర: 9848696291 [W-1237304]

PLOT FOR SALE

■ ఓగ్లాపూర్ పవర్‌గ్రిడ్‌కు ఎదురుగా 200 ఫీట్ రోడ్‌కి ఆనుకొని కాంపౌండ్ కట్టి ఉన్న ప్లాటు (వెడల్పు 30 పొడవు 120) 400 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9701218888. [W-1237301]

■ HNK KITS, అంబాల రోడ్, ముచ్చర్ల రోడ్ New Highwayకు 100 మీ॥ సమీపంలో గ॥ 166 & 333 & 466 గజాల ప్లాటు కలవు. సంప్ర॥ 9553255936. [W-1239991]

SERVICES

LOSS OF PASSPORT

■ I, DODDA RAJESHWARI, W/o. Dodda Eshwaraiah, R/o. H.No. 6-4, Peechara Village, Velair Mandal, Hanumakonda Dist, Telangana, have lost the original passport bearing No: N2644083, I am travelling by bike from Peechara to Velair if anyone is found, please inform me at the above address and Cont. No: 9705053438. [W-1239785]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED

■ వరంగల్, పరకాల, కాటారం, ఏటూరునాగారం, నర్సంపేట, తొర్రూర్, MHBD, జనగాం, ఏరియాలో ఆఫీస్‌లో IC, ASM, ESM, BDM పోస్టులకై 10th, డిగ్రీ, చదివిన స్త్రీ/పు॥లు కావలెను. ఇంటర్వ్యూ. HNK. 9492505566. [W-1237302]

■ స్టార్ హోంకేర్ సర్వీసు 24 గం॥ పేషెంట్లు పెద్దవారిని వారి ఇంటి వద్దనే ఉండి 24 గం॥ డ్యూటి చేయడానికి, కేర్‌టేకర్, ఆయాలు, మగవారు / ఆడవారు కావలెను. 9100116067, 9059016067 [W-1239915]

■ మా ఆఫీస్‌లో పనిచేయుటకు Telecallers, Receptionist, Management, Marketing, Supervisor, Office Boy స్త్రీ పురుషులు కావలెను. Contact: 7382323126, 9491706517 [W-1237305]

■ మా అపార్ట్‌మెంట్స్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సూపర్ వైజర్స్, స్వీపర్స్, స్త్రీ, పురుషులు కావలెను. Contact: 9491710857, 7382106287 [W-1237306]

■ త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను.ఫ్రీ వసతి + భోజనం. జీతం: 17K. ఫోన్: 8520874499, 8520980099 [H-796282]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

టీజీ ఎన్పీడీసీఎల్‌లో బదిలీలు

షెడ్యూల్ విడుదల చేసిన యాజమాన్యం
- నేడు అర్హుల జాబితా ప్రదర్శన
- ఈ నెల 30న అభ్యంతరాల స్వీకరణ
- అక్టోబర్ 4న దరఖాస్తులకు అవకాశం





హన్మకొండ: తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలిలో అధికారులు, ఉద్యోగుల బదిలీలకు రంగం సిద్ధమైంది. ఇటీవలి వరకు పదోన్నతి కల్పించిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం బదిలీలు చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు కంపెనీ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. ఈ ఉత్తర్వులోని కొన్ని అంశాల్లో స్పష్టత కొరవడినట్లు కనిపిస్తోంది. గతంలో సీనియారిటీ ఆధారంగా నేరుగా బదిలీలు చేయగా.. ఈసారి ఆన్‌లైన్ పద్ధతిలో బదిలీల ప్రక్రియ చేపట్టనున్నారు. అదే విధంగా ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, ప్రావిన్షియల్ ఉద్యోగులకు పాత పద్ధతిలో బదిలీలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు నగరం, పట్టణ, జిల్లా, మండల కేంద్రాల్లో పని చేస్తున్న వారిని గ్రామీణ ప్రాంతాలకు.. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న వారిని నగరం, పట్టణం, జిల్లా, మండల కేంద్రాలకు బదిలీ చేయనున్నారు. 2025 సెప్టెంబర్ 30 వరకు మాత్రమే సర్వీస్ ఉన్నవారికి బదిలీ నుంచి ఉపశమనం కల్పించారు. వారు కావాలని కోరుకుంటే బదిలీకి దరఖాస్తు చేసుకోవచ్చు. స్పౌజ్, వితంతువులు, 70 శాతం వైకల్యం కలిగిన దివ్యాంగులు, కుటుంబ సభ్యులు అనారోగ్యంగా ఉన్నవారికి బదిలీల్లో కోరుకున్న ప్రాంతానికి వెళ్లేలా ప్రాధాన్యత కల్పించారు. వీరు కావాల్సిన పత్రాలు దరఖాస్తుతో జతపర్చాల్సి ఉంటుంది.

ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో పని చేస్తున్న జూనియర్ లైన్‌మెన్‌ల నుంచి లైన్ ఇన్‌స్పెక్టర్ వరకు డివిజన్ స్థాయిలో డివిజనల్ ఇంజనీర్ బదిలీలు చేస్తారు. సబ్ ఇంజనీర్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ ఫోర్‌మెన్, ఇతర సిబ్బందిని సర్కిల్ స్థాయిలో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) బదిలీలు నిర్వహిస్తారు. వీరిని ప్రస్తుతం పని చేస్తున్న ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి బదిలీ చేస్తారు. కార్పొరేట్ ఆఫీస్‌లో పని చేస్తున్న సబ్ ఇంజనీర్ నుంచి జూనియర్ పర్సనల్ ఆఫీసర్ వరకు ఉద్యోగులను అదే ఆఫీస్‌లో ఒక విభాగం నుంచి మరో విభాగానికి బదిలీ చేస్తారు. ఏఈ, ఏఏఈ, ఏడీఈల బదిలీలు సర్కిల్ స్థాయిలో ఎస్ఈలు చేస్తారు. సివిల్ ఏఈ, ఏఏఈ, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌ను హెచ్ఆర్‌డీ సీజీఎం బదిలీ చేస్తారు. కార్పొరేట్ ఆఫీస్‌లో పని చేస్తున్న ఏఈ, ఏఏఈ, ఏడీఈలను కార్పొరేట్ ఆఫీస్‌లో ఇతర విభాగాలకు కాని, ప్రస్తుతం పని చేస్తున్న హెడ్‌క్వార్టర్ అవతలికి బదిలీ చేస్తారు. అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లను సర్కిల్‌ల మధ్య బదిలీ చేస్తారు. పీ అండ్ జీ విభాగంలో పని చేసే ఉద్యోగులను కార్పొరేటర్ ఆఫీసర్‌లో వివిధ సెక్షన్ల మధ్య బదిలీ చేస్తారు.

రెండు పద్ధతుల్లో ట్రాన్స్‌ఫర్లు

2024 జూన్ 30 వరకు ఒకే పోస్టులో రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారు బదిలీలకు అర్హులుగా పేర్కొన్నారు. ఇందులో 50 శాతానికి మించకుండా బదిలీలు చేయనున్నారు. ఈ నెల 28న(నేడు) బదిలీలకు అర్హులైనవారి జాబితాను వెబ్ ఆప్షన్ వారికి వెబ్ సైట్‌లో, పాత పద్ధతిలో బదిలీలు నిర్వహించేవారికి సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో ప్రదర్శిస్తారు. ఈ నెల 30న అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 4 తేదీన వెబ్ ప్రక్రియ ద్వారా బదిలీలు జరిగే వారు వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి, పాత పద్ధతి వారికి నేరుగా బదిలీ చేస్తారు. అక్టోబర్ 7న బదిలీ ఉత్తర్వులు జారీ చేస్తారు. 9న ప్రస్తుత పని చేస్తున్న స్థానంలో రిలీవ్ కావాలి. 8 నుంచి బదిలీలపై బ్యాన్ అమలులోకి వస్తుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. క్రమశిక్షణ చర్యలు, విజిలెన్స్ విచారణ వాటికి బ్యాన్ వర్తించదని తెలిపారు.

అభ్యంతరాలు సరే.. పరిశీలన ఎప్పుడు?

ఈ నెల 30న బదిలీ అర్హుల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తామని ఉత్తర్వులో పేర్కొన్నా.. అభ్యంతరాలు ఎప్పటిలోగా పరిశీలిస్తారు..? అర్హుల తుది జాబితా ఎప్పుడు ప్రదర్శిస్తారనేది పేర్కొనకపోవడం గమనార్హం. కాని బదిలీలకు అక్టోబర్ 4న మాత్రమే దరఖాస్తులు స్వీకరించనున్నట్లు సూచించారు. ఒక్క రోజులోనే వెబ్‌సైట్‌లో దరఖాస్తుల స్వీకరణ సాధ్యమేనా.. అని అధికార వర్గాలు సందేహం వ్యక్తం చేస్తున్నాయి. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రొటెక్షన్ కింద ఎంప్లాయీస్ యూనియన్లు, ఇంజనీర్స్ అసోసియేషన్లు, వెల్ఫేర్ అసోషియేషన్లన్నీ కలిపి 17 సంఘాలకు అనుమతిచ్చారు. మరో ప్రధాన ట్రేడ్ యూనియన్ భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) అనుబంధ తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్‌ను యాజమాన్యం విస్మరించింది. అయితే ప్రొటెక్షన్ కింద కంపెనీ స్థాయిలో యూనియన్, అసోసియేషన్ నుంచి అధ్యక్షుడు, లేదా కార్యదర్శిలో ఒక్కరికి మాత్రమే అవకాశం ఇచ్చారు. సర్కిల్ స్థాయిలోనూ యూనియన్, అసోసియేషన్ల నుంచి అధ్యక్ష, కార్యదర్శిలో ఒక్కరికి మాత్రమే అవకాశం కల్పించారు. యూనియన్, అసోసియేషన్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులు ఉద్యోగులు, యాజమాన్యానికి అనుసంధానంగా వ్యవహరించేందుకు అందుబాటులో ఉండేలా వారు కోరుకున్న స్థానంలో పోస్టింగ్ పొందే అవకాశం ఉంది.

కక్కుర్తి పడ్డారు.. అడ్డంగా దొరికారు

- ఏసీబీకి చిక్కిన జనగామ ఆర్అండ్‌బీ ఈఈ, ఏటీఓ
- రిటైర్డ్ జవాన్ వద్ద రూ.14వేలు డిమాండ్


ఏసీబీకి పట్టుబడ్డ ఈఈ, ఏటీఓ

జనగామ: జనగామ జిల్లా ఆర్అండ్‌బీ ఈఈ చిలకపాటి హుస్సేన్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ ఏ.రవీందర్ లంచం తీసుకుంటూ శుక్రవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం బండ్లగూడకు చెందిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ చిర్ర సత్యపాల్‌రెడ్డి సతీమణి పేరిట ప్రభుత్వం ఆరు నెలల క్రితం హెచ్‌పీ పెట్రోల్ బంక్ మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి తహసీల్దార్, ఆర్డీఓ, పంచాయతీ కార్యదర్శితోపాటు ఆర్అండ్‌బీ అధికారుల నుంచి ఎన్ఓసీ(నో ఆబ్జక్షన్ సర్టిఫికెట్) ఇవ్వాల్సి ఉంటుంది. ప్రస్తుతం తహసీల్దార్, పంచాయతీలో ఫైల్ పెండింగ్‌లో ఉండగా, ఆర్అండ్‌బీ ఈఈ వద్దకు రాగా రూ.17వేలు డిమాండ్ చేశారు. బేర సారాలతో రూ.14 వేలకు ఒప్పందం కుదుర్చుకున్న బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈనేపథ్యంలో రిటైర్డ్ ఆర్మీ జవాన్ సత్యనారాయణరెడ్డి ఏసీబీ అధికారుల సలహా మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఈఈ హుస్సేన్‌కు డబ్బులు తీసుకొచ్చినట్లు చెప్పాడు. ఏటీఓ రవీందర్‌కు రూ.2వేలు ముట్టజెప్పి, తనకు (ఈఈ) రూ.12వేలు ఇవ్వాలని సూచించారు. వారికి డబ్బులు ఇవ్వగానే ఏసీబీ అధికారులు ఈఈ, ఏటీఓను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కెమికల్ పరీక్షలు నిర్వహించి, లంచం రూపంలో తీసుకున్న డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి, విచారణ జరిపిన అనంతరం, వరంగల్ ఏసీబీ కోర్టుకు తరలించారు.

నిరక్ష్యంగా మాట్లాడారు



ప్రభుత్వం నా భార్య పేరిట హెచ్‌పీ పెట్రోల్ బంక్ మంజూరు చేసింది. ఎన్ఓసీ కోసం వెళ్తే ఆర్అండ్‌బీ ఈఈ లంచం అడిగారు.. సర్.. నేను ఆర్మీ జవాన్‌గా పనిచేసిన.. కొంచెం చూడండి అంటూ బతిమిలాడిన. మా ప్రాసెస్ మాకుంటుంది. మేము పని చేస్తలేమా.. అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడారు. ఎన్ఓసీ ఆలస్యం చేస్తారనే ఉద్దేశంతో రూ.14వేలకు ఒప్పుకుని ఏసీబీ అధికారులను ఆశ్రయించా. ఇలాంటి చీడపురుగులను సర్వీస్ నుంచి తొలగించాలి.

– చిర్ర సత్యపాల్‌రెడ్డి, ఆర్మీ జవాన్, బండ్లగూడ

పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పదోన్నతులు, బదిలీలు



వరంగల్ లీగల్: రాష్ట్ర వ్యాప్త బదిలీలో భాగంగా వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన గ్రేట్–2 పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జి. భద్రాద్రి, ఎల్‌హెచ్ రాజేశ్వర్‌రావు, మహబూబాబాద్‌కు చెందిన గ్రేట్– 2 పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సంతోషికి గ్రేడ్ –1 పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా పదోన్నతి కల్పిస్తూ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ వైజయంతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. హనుమకొండ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.భద్రాద్రి.. రంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు, ఏడో అదనపు జిల్లా కోర్టుకు బదిలీ అయ్యారు. వరంగల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎల్‌హెచ్ రాజేశ్వర్ రావు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టుకు బదిలీకాగా మహబూబాబాద్ అసిస్టెంట్ సెషన్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.సంతోషి వరంగల్ మూడో అదనపు జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

వరంగల్, హనుమకొండ జిల్లాల కోర్టులో జాతీయ లోక్ అ దాలత్‌ను ప్రధాన న్యాయమూర్తులు వీ.బీ.నిర్మల గీతాంబ, బి.అపర్ణదేవి శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్లు డాక్టర్ సత్యశారద, ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝా, బార్ అసోసియేషన్ల అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, రమేష్‌బాబు హాజరుకానున్నారు. కక్షిదారులు సకాలంలో హాజరై జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో కేసుల పరిష్కరించుకోవాలని, న్యాయ సేవాధికార సంస్థ హనుమకొండ, వరంగల్ జిల్లాల కార్యదర్శులు సాయి కుమార్, ఉపేందర్ రావు శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు.

కాజీపేట మీదుగా దసరా ప్రత్యేక రైళ్లు

- అక్టోబర్ 2 నుంచి ప్రారంభం



కాజీపేట రూరల్: దసరా, దీపావళి పండుగల సమయంలో ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో కాజీపేట జంక్షన్ మీదుగా దక్షిణమధ్య రైల్వే అధికారులు తిరుపతి–సికింద్రాబాద్, సికింద్రాబాద్–తిరుపతి మధ్య 28 రైళ్ల సర్వీస్‌లను ప్రవేశపెట్టి నడిపిస్తున్నట్లు శుక్రవారం రైల్వే అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్–తిరుపతి మధ్య 14 రైళ్ల సర్వీసులు


అక్టోబర్ 2, 4, 9, 11, 16, 18, 23, 25, 30వ తేదీల్లో నవంబర్ 1, 6, 8, 13, 15వ తేదీల్లో సికింద్రాబాద్–తిరుపతి (07041) వెళ్లే స్పెషల్ ట్రైన్ ప్రతి బుధ, శుక్రవారాల్లో సికింద్రాబాద్‌లో 17:50 గంటలకు బయలుదేరి కాజీపేట జంక్షన్ 19:52 గంటలకు చేరుకుటుంది.

తిరుపతి–సికింద్రాబాద్ మధ్య14 రైళ్ల సర్వీస్‌లు

అక్టోబర్ 3, 5, 10, 12, 17, 19, 24, 26, 31వ తేదీల్లో, నవంబర్ 2, 7, 9, 14, 16వ తేదీల్లో తిరుపతి–సికింద్రాబాద్ (07042) వెళ్లే స్పెషల్ ట్రైన్ ప్రతి గురు, శనివారాల్లో తిరుపతిలో 09:40 గంటలకు బయలుదేరి మరునాడు కాజీపేట జంక్షన్‌కు 05:23 గంటలకు చేరుకుంటుంది. ఈ స్పెషల్ ట్రైన్స్ అప్ అండ్ రూట్‌లో జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, కొండపల్లి, విజయవాడ, తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, రేణిగుంట స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు.

ఆగిఉన్న ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్

- కానిస్టేబుల్ దుర్మరణం
- తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో విధులు


విజేందర్ (ఫైల్)

మామునూరు: జాతీయ రహదారిపై నిలిచి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ బలంగా ఢీ కొట్టడంతో కానిస్టేబుల్ దుర్మరణం పాలయ్యాడు. ఈఘటన శుక్రవారం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై మామునూరు గ్రామ శివారు చెరువు కట్ట సమీపాన జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామానికి చెందిన దబ్బేట విజేందర్(32) తొర్రూర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తొలుత నర్సంపేటలో విధులు నిర్వహిస్తున్న క్రమంలో శ్రావణిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లల చదువు రీత్యా వరంగల్ శంభునిపేట ఏరియాలో ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. రోజూ తొర్రూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విధులు పూర్తి చేసి ఇంటికి వస్తుంటాడు. ఈక్రమంలో శుక్రవారం విధులు ముగించుకుని తొర్రూర్ నుంచి బైక్ పై ఇంటికి బయల్దేరాడు. ఈక్రమంలో మామునూరు శివారు చెరువు కట్ట సమీపానికి చేరుగానే పంచర్ కావడంతో రోడ్డుపై నిలిపి ఉంచిన ట్రాక్టర్‌ను బైక్అదుపు తప్పి బలంగా ఢీకొట్టింది. దీంతో కానిస్టేబుల్ దబ్బేట విజేందర్ తీవ్రగాయలై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతుండగా.. స్థానికులు వరంగల్ హంటర్ రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. ఘటన స్థలానికి మామునూరు ఎస్సై కృష్ణవేణి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని మెడికవర్ నుంచి ఎంజీఎం మార్చురీకి తరలించారు. విజేందర్ భార్య శ్రావణి ఫిర్యాదు మేరకు శుక్రవారం సాయంత్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

127కిలోల ఎండుగంజాయి స్వాధీనం


మరిపెడలో పట్టుకున్న గంజాయిని చూపుతున్న పోలీసులు

మరిపెడ: మరిపెడ మండలంలోని గాలివారిగూడెం స్టేజి వద్ద కారులో తరలిస్తున్న 127కిలోల ఎండుగంజాయిని మరిపెడ పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ తెలిపారు. మరిపెడ పీఎస్‌లో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా కుంట మండలం ఆసీర్‌గూడేనికి చెందిన రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న సోడీ నాగేశ్వరరావు కారులో గంజాయిని తరలిస్తుండగా మరిపెడ పోలీసులకు సమాచారం రావడంతో గాలివారి గూడెం స్టేజి వద్ద పట్టుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తరలిస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. గంజాయి విలువ సుమారు రూ.31లక్షలు ఉంటుందని చెప్పారు. గంజాయితోపాటు కారును స్వాధీన పరుచుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఎస్సైలు సతీశ్, సంతోశ్, కానిస్టేబుళ్లను ఎస్పీ రివార్డులతో అభినందించారు. కార్యక్రమంలో సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అనుమానమే పెనుభూతమై..

- భార్య గొంతు కోసి.. కత్తితో దాడి చేసిన భర్త
- అడ్డుకున్న అత్తమామకు గాయాలు
- అల్లుడిపై ఫిర్యాదు చేసిన అత్తమామ


కవితకు ప్రథమ చికిత్స చేస్తున్న అంబులెన్స్ సిబ్బంది

వర్ధన్నపేట: ఊర్లో జులాయిగా తిరుగుతూ వ్యసనాలకు అలవాటుపడిన ఓ వ్యక్తి భార్యపై అనుమానంతో దాడికి పాల్పడ్డాడు. అడ్డువచ్చిన అత్తమామలపై సైతం దాడి చేయడంతో వారు గాయాలపాలయ్యారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. వర్ధన్నపేటకు చెందిన బొజ్జ వీరలక్ష్మి, వీరస్వామి దంపతులకు నలుగురు కుమార్తెలు. మూడో కూతురు చొప్పరి కవితను 30 సంవత్సరాల క్రితం జనగామ జిల్లా చిల్పూర్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన రవికి ఇచ్చి వివాహం చేశారు. వీరి కుమారులు ఒకరు అండన్‌లో, ఒకరు బెంగళూరులో ఉద్యోగరీత్యా ఉంటున్నారు. రవి వ్యవసాయం చేసుకోకుండా గ్రామంలో జులాయిగా తిరుగుతూ చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. ఈ క్రమంలో భార్య కవితను ఎప్పుడు అనుమానిస్తూ గొడవ పడుతూ హింసిస్తుండేవాడు. భర్త హింసను భరించలేక కవిత వర్ధన్నపేటలో తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. గురువారం వర్ధన్నపేటకు వచ్చిన రవి.. అత్తమామలు, భార్యకు.. తాను మారానని ఇక ఎప్పుడు ఏమీ అనను అని నమ్మించారు. గురువారం రాత్రి అందరూ నిద్రకు ఉపక్రమించిన తర్వాత రవి తన వెంట తెచ్చుకున్న రాడ్‌తో నిద్రలో ఉన్న కవిత తలపై కొట్టాడు. దీంతో ఆమె తల్లిదండ్రులు దాడిని ఆపడానికి ప్రయత్నం చేస్తుండగానే కత్తితో కవిత మెడను సైతం కోశాడు. ఈ ఘర్షణలో వృద్ధులైన అత్తామామలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి అరుపులకు ఇరుగు పొరుగు వారు రావడంతో రవి అక్కడి నుంచి పరారయ్యాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా అంబులెన్స్ పైలెట్ కుమార్, ఈఎంటీ మేగరాజు తీవ్రంగా గాయపడిన కవితకు ప్రథమ చికిత్స చేసి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతుంది. కవిత తల్లి వీరలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మంత్రాల నెపంతో వృద్ధుడి హత్య

- వివరాలు వెల్లడించిన తొర్రూరు సీఐ జగదీశ్


యాకయ్య మృతదేహం


వివరాలను వెల్లడిస్తున్న సీఐ జగదీశ్

నెల్లికుదురు: మంత్రాలు చేసి.. తన కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాడనే మూఢ నమ్మకంతో ఓ వ్యక్తి.. వృద్ధున్ని తలపై కొట్టి చంపిన ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్నముప్పారంలో చోటు చేసుకుంది. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తొర్రూర్ సీఐ జగదీశ్.. నెల్లికుదురు ఎస్సై చిర్ర రమేశ్‌బాబుతో కలసి శుక్రవారం వివరాలు వెల్లడించారు. చిన్నముప్పారం గ్రామానికి చెందిన మల్లం యాకయ్య (60) మంత్రాలు చేసి తన ఆరోగ్యం నాశనం చేశాడని, ప్రతిరోజూ ఆయనే కలలోకి వస్తున్నాడని మూఢ నమ్మకంతో కక్ష పెంచుకున్న అదే గ్రామానికి చెందిన మల్లం రాజు.. యాకయ్యను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 6.30 గంటలను గ్రామంలోని ముత్యాలమ్మ గుడి వద్ద మంచం పట్టితో కాపుకాచి ఉన్న మల్లం రాజు.. అటుగా వెళ్తున్న మల్లం యాకయ్య తలపై కొట్టడంతో యాకయ్య అక్కడికి అక్కడే మృతి చెందాడు. యాకయ్య కుమారుడు మల్లం రమేశ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని రాజును అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

ముగిసిన పీహెచ్‌డీ అడ్మిషన్లు

- కేయూలో పాత నోటిఫికేషన్ మెరిట్ లిస్టు ప్రకారమే భర్తీ
- తొలుత కంటే ఇప్పుడే ఎక్కువ సీట్లు
- రెండు, మూడు జాబితాలు కలిపి 243 సీట్లలో అడ్మిషన్లు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోషల్ సైన్స్, సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్, ఫార్మసీ ఆర్ట్స్ విభాగాలల్లో పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియ ఎట్టకేలకు ఇటీవల ముగిసింది. గతంలో పీహెచ్‌డీ మొదటి కేటగిరీలో మిగిలిన సీట్లను రెండో కేటగిరీలోనికి మార్చు చేసి రెండోలిస్టుగా అడ్మిషన్లు కల్పించారు. 2021–2022లో పీహెచ్‌డీ నోటిఫికేషన్ ద్వారా ప్రవేశపరీక్ష నిర్వహించిన ఫలితాల అనంతరం ఇంటర్వ్యూలను నిర్వహించారు. మెరిట్ జాబితాలోనుంచి అభ్యర్థులకు అడ్మిషన్లు కల్పించాక కొందరుసీటురాని విద్యార్థులు వివిధ ఆరోపణలు చేస్తూ అప్పట్లో ఆందోళనలు చేసిన విషయం విధితమే. ఈసమస్య ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో మొదటి కేటగిరీలో మిగిలిన సీట్లతోపాటుగా గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత నుంచి ఈఏడాది మార్చి 31వరకు వివిధ విభాగాలల్లో ఏర్పడిన వేకన్సీలను కూడా వెల్లడించి అడ్మిషన్లు కల్పించేందుకు యూనివర్సిటీ అధికారులు నిర్ణయించారు. ఇటీవల వివిధ విభాగాల డీన్‌లు సంబంధిత కమిటీతో కలిసి గతంలో పీహెచ్‌డీ రెండో కేటగిరీలో ప్రవేశపరీక్షలో మెరిట్ లిస్టు ఆధారంగా మూడోలిస్టుగా పీహెచ్‌డీ అడ్మిషన్లు కల్పించారు. ఈ ప్రక్రియ అంతా గత కొద్దిరోజులపాటు కొనసాగింది. ఆర్ట్స్, సోషల్ సైన్స్ విభాగాల్లో ప్రవేశం పొందిన విద్యార్థులు ఈనెల 19వరకు ఫీజు చెల్లించి అడ్మిషన్లు పొందే అవకాశం కల్పించగా సైన్స్ విభాగాల విద్యార్థులకు ఈనెల 23వరకు చివరి గడువు విధించి అడ్మిషన్లు కల్పించారు. వివిధ విభాగాల డీన్‌లు డీఆర్‌సీ సమావేశాలు నిర్వహించి పరిశోధక విద్యార్థులకు సూపర్‌వైజర్లను కేటాయించారు. సైన్స్ విభాగాలల్లో ఫిజిక్స్, మ్యాథ్స్, స్టాటిస్టిక్స్ విభాగాల్లో సూపర్‌వైజర్లను కేటాయించే ఈప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంది. వివిధ విభాగాలు పాత నోటిఫికేషన్ ద్వారానే మెరిట్ లిస్టుల ప్రకారం అడ్మిషన్లు కల్పించినట్లు సీట్లు వచ్చినవారి జాబితాలను కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారని తెలుస్తోంది. 2021–2022 నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు 210సీట్ల వేకన్సీలు చూపి వాటిని భర్తీచేయగా అందులో 208 ప్రవేశాలు పొందారు. ఆందోళనల ఫలితంగా రెండోజాబితా, మూడో జాబితాల పేరున అప్పటికంటే ఎక్కువగా మరో 243 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు.

లైబ్రరీ సైన్స్‌లో అడ్మిషన్లకు అవకాశం

కేయూలోని లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగంలో ఇక పీహెచ్‌డీ అడ్మిషన్లకు యూనివర్సిటీ అధికారులు అవకాశం కల్పించారు. ఈ లైబ్రరీ సైన్స్ విభాగాన్ని 2004–2005లో క్యాంపస్‌లో ఏర్పాటుచేశారు. ఆ విభాగం అధిపతిగా ప్రస్తుతం డాక్టర్ రాధికారాణి వ్యవహరిస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఆమెకు నలుగురికి పీహెచ్‌డీ గైడ్‌షిప్‌కు అవకాశం కల్పించారు. సోషల్‌సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ అడ్మిషన్లకు ఈనెల 25న సోషల్ సైన్స్ డీన్ మనోహర్ నోటిఫికేషన్ జారీచేశారు. అక్టోబర్ 10వ తేదీవరకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఎకనామిక్స్‌లో 3సీట్లు, లైబ్రరీ సైన్స్‌లో నాలుగు సీట్లు, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో 1, సోషియాలజీలో ఒక సీటు ఉన్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు మనోహర్ వెల్లడించారు.

ఫెలోషిప్స్ నెట్ కలిగినవారికే పీహెచ్‌డీ అడ్మిషన్లు

కాకతీయ యూనివర్సిటీలో ఇక నుంచి ఏర్పడే పీహెచ్‌డీ అడ్మిషన్లకు ప్రవేశపరీక్ష ఉండదు. నేషనల్ ఫెలోషిప్స్, జేఆర్ఎఫ్ నెట్ తదితర ఫెలోషిప్స్ కలిగినవారికే పీహెచ్ అడ్మిషన్లు ఇవ్వనున్నారు. ఈమేరకు కొత్తగా యూజీసీ నిబంధనల ప్రకారమే అడ్మిషన్లు కల్పించేందుకు యూనివర్సిటీ నిర్ణయించింది. ముఖ్యంగా సంవత్సరానికి రెండుసార్లు మాత్రమే వేకన్సీలకు అనుగుణంగా ప్రతి ఏడాది రెండుసార్లు జూలై ఆ తర్వాత జనవరిలో మాత్రమే డీన్‌లు నోటిఫికేషన్లు ఇచ్చి నిబంధనల ప్రకారం అడ్మిషన్లు కల్పించాల్సి ఉంటుంది. ఇక నుంచి ఆచార్యులకు 57 ఏళ్ల వయస్సువరకే పీహెచ్‌డీ గైడ్‌షిప్‌ను కల్పిస్తారు. ఉద్యోగ విరమణకు మూడేళ్ల ముందునుంచే పీహెచ్‌డీ పరిశోధకులకు కేటాయింపు ఉండదు.

తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రవేశపరీక్ష

హన్మకొండ కల్చరల్ : తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠం వరంగల్ ప్రాంగణంలో ఎం.ఏ తెలుగు కోర్సుకు దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 28 శనివారం నుంచి వెబ్‌సైట్ www.pstucet.org ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 3న ఉదయం వరంగల్ హంటర్‌రోడ్‌లోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.